

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

బెలగాం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వాయిదా పడినట్లు రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయ సేవా సాధికారత కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జూలై 5న లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

లక్ష్యం 1413 మంజూరు 224

- ఇదీ బీసీ రుణాల మంజూరు పరిస్థితి
- వివిధ కారణాలతో బ్యాంకుల కొర్రీలు
- సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని దరఖాస్తుల తిరస్కరణ
- ఆందోళనలో లబ్ధిదారులు
- ప్రభుత్వం స్పందించాలని విన్నపం





పార్వతీపురం, మే 1(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాల మంజూరుకు బ్యాంకులు కొర్రీలు పెడుతున్నాయి. గతంలో మంజూరైన రుణాలను చూపించడంతో పాటు డిఫాల్టర్ పేరిట సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని కొన్నిచోట్ల దరఖాస్తులను తిరస్కరిస్తున్నాయి. పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేసేందుకు ఆమోదం తెలపడం లేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందు తున్నారు. మొత్తంగా బ్యాంకుల తీరుతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారే పరిస్థితి కనిపిస్తోంది.

ఇదీ పరిస్థితి..

● గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా పేదలకు ఎటువంటి రుణాలు మంజూరు చేయలేదు. దీంతో జిల్లాలో ఎంతోమంది స్వయం ఉపాధి పొందలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ రుణాలకు శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లావాసులు ఎంతో ఆనందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సబ్సిడీ రుణాల కోసం అధికారులు పెద్దఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుదారులకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు దరఖాస్తులను పంపించారు. అయితే బ్యాంకులు మాత్రం కరుణించడం లేదు. సబ్సిడీ రుణాలకు మోకాళ్లలడ్డు తున్నాయి. దీంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సి వస్తోంది. బ్యాంకర్ల తీరుతో మరోవైపు మండల , జిల్లా అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

● జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1413 మంది లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారుల దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. అయితే ఇప్పటివరకు కేవలం 224 మంది లబ్ధిదారులకే బ్యాంకులు విల్లింగ్ ఇచ్చాయి. మిగిలిన దరఖాస్తుల్లో కొన్ని పెండింగ్‌లో ఉండగా మరికొన్నింటిని బ్యాంకులు వివిధ కారణాలతో తిరస్కరించాయి.

మండలాల్లో ఇలా..

● వీరఘట్టం మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు 92 మందిని అధికారులు ఎంపిక చేశారు. వారి దరఖాస్తులను బ్యాంకులకు పంపిస్తే ఇప్పటివరకు ఒక్క లబ్ధిదారునికి కూడా రుణం మంజూరు చేయలేదు.

● మక్కువ మండలంలో 72 దరఖాస్తులు బ్యాంకులకు పంపించగా 16 మందికి మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపాయి.

● కొమరాడ మండలంలో 50 మంది దరఖాస్తులు బ్యాంకులకు వెళ్లగా కేవలం 8 మందికి మాత్రమే రుణాలు మంజూరయ్యాయి.

● సీతానగరం మండలంలో 107 దరఖాస్తులు బ్యాంకులకు వెళ్లగా కేవలం 25 దరఖాస్తులకు మాత్రమే బ్యాంకులు ఆమోదం తెలిపాయి.

● బలిజిపేట మండలంలో 126 దరఖాస్తులు బ్యాంకులకు వెళ్లగా కేవలం ఏడుగురికి మా త్రమే రుణాలు చేశారు.

● గరుగుబిల్లి మండలంలో 118 దరఖాస్తులకు గాను 46 మందికి రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు అంగీకరించాయి.

● పాచిపెంట మండలంలో 38 దరఖాస్తులకు గాను 18 మందికి బ్యాంకులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి.

బ్యాంకులతో సంప్రదిస్తున్నాం

జిల్లాలో 1413 యూనిట్లకు సంబంధించి ఇప్పటివరకు 224 యూనిట్లకు బ్యాంకులు ఆమోదం తెలిపాయి. మిగిలిన యూనిట్ల రుణాల మంజూరు కోసం బ్యాంకులతో సంప్రదిస్తున్నాం. డిఫాల్టర్ పేరిట సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని బ్యాంకర్లు కొన్ని దరఖాస్తులు తిరస్కరించడం వాస్తవమే. ఎంపీడీవోలు బ్యాంకులతో మాట్లాడి ఆయా దరఖాస్తులను ఆమోదించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకుంటాం.

\- గడ్డెమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

సెల్‌ఫోన్లు దొంగిలించి..
యూపీఐతో నగదు మళ్లించి

- ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు
- రూ.90,200 స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను దొంగిలించి యూపీఐ ద్వారా నగదును కొల్లగొడుతున్న సైబర్ ముఠా పాలకొండ పోలీసులకు పట్టుబడింది. ముగ్గురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.90,200 స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు విలేకరులకు వెల్లడించారు. గత నెల 20న భామినికి చెందిన నారాయణరావు అనే వ్యక్తి పాలకొండ పట్టణంలోని ఓ ఏటీఎం కేంద్రానికి వచ్చాడు. అక్కడ ఆయన సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు దొంగిలించారు. వెంటనే ఆ ఫోన్‌లోని యూపీఐ యాప్ ద్వారా రూ.92,700 నగదును మరో ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీనిపై నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ అధికారులు నారాయణరావు అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి లావాదేవీల ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల వెంకటేష్, మహ్మద్ భాషా, గజపతినగరానికి చెందిన పసుపురెడ్డి గోపీచంద్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.90,200 రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గతంలో వీరు ఏటీఎం కార్డులను క్లోన్ చేసి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. కేసు ఛేదనలో చురుగ్గా పనిచేసిన సీఐ చం ద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తిని డీఎస్పీ అభినందించారు.

జీసీసీకి పూర్వ వైభవం

- సంస్థ బలోపేతానికి ప్రభుత్వ నిర్ణయం
- ఉద్యోగుల పదోన్నతులు, సిబ్బంది నియామకంపై దృష్టి
- అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పన



గుమ్మలక్ష్మీపురం జీసీసీ కార్యాలయం

గుమ్మలక్ష్మీపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా అడు గులు పడుతున్నాయి. జీసీసీ బలోపేతంపై ఆ సంస్థ చైర్మన్‌తో పాటు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిం చింది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగుల పదోన్నతి కల్పించకపో వడం, ఒకే పోస్టులో విధులు నిర్వహించడం వంటి విష యాల్లో ఉద్యోగుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. అలాగే, అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవ డంతో గిరిజనులు నష్టపోయేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీసీసీలో సంస్కరణలు తీసుకురావడానికి, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. దీంతో ఉద్యోగులు, గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నా యి. ఒకప్పుడు జీసీసీకి ఎంతోపేరు ఉండేది. ఎస్సీ కార్పొరేషన్ రంగం అతిపెద్ద వ్యాపార లావాదేవీలు కలిగిన అరకు కాఫీని అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లిన ఘనత జీసీసీకి ఉంది. గతంలో ఈ సంస్థలో 5 వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. ప్రతి ఏటా రూ.500 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరిగేవి. ప్రస్తుతం 500లోపు మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వహి స్తున్నారు. మూడు దశాబ్దాల నుంచి జీసీసీలో కొత్తగా నియామకాలు లేవు. ఉన్న ఉద్యోగులతోనే పని చేయిస్తున్నారు. దీనివల్ల వారిపై పనిభారం పెరిగింది. దీంతో వ్యాపార లావాదేవీలు ఆశించిన స్థాయిలో లేకపోవ డంతో జీసీసీ లక్ష్యాలు మందగించాయి. కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో జీసీసీకి పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటుంది. జీసీసీ వ్యాపార లక్ష్యాలను పెంపొందించడానికి నడుం బిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జీసీసీ డీఆర్ డిపోల్లో సేల్స్‌మెన్లను నియమించడానికి, జూనియర్ మేనేజర్లకు పదోన్నతి కల్పించడానికి ప్రణాళికలు రూపొందించింది. గిరిజనుల నుంచి సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి వాటిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో జీసీసీకి పూర్వవైభవం వస్తుందని గిరిజనులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఇటీవల జీసీసీ బోర్డు సమావేశం జరిగింది. జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లకు జూనియర్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించేందుకు నిర్ణయించారు. గిరిజనుల ఉత్పత్తులకు కూడా మద్దతు ధర కల్పిస్తారు. ప్రభుత్వానికి, మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు.

\-వి.మహేంద్ర, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం

సుంకిని
వదలని ఏనుగులు

గరుగుబిల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకి గ్రామంలో ఏనుగులు తిష్ఠవేశాయి. గత నాలుగు రోజులుగా గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నాయి. నువ్వు, మొక్కజొన్న, అరటి, వరి, పామాయిల్ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తు న్నాయి. కల్లాల్లో నిల్వ చేసిన ధాన్యం రాసులను చిందర వందర చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ వరి పంట చేతికి అందివచ్చిన సమయంలో గజరాజుల గుంపు మరోమారు గ్రామంలోకి రావడంతో పంట పొలా లకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఏనుగులతో ప్రజలకు ఆటంకం నెలకొనకుండా అటవీ సిబ్బంది, ట్రాకర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఏనుగులు సంచరించిన ప్రాంతం వైపు రైతులు రాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. సురక్షిత ప్రాంతానికి గజరాజుల గుంపును తరలించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



సుంకి పామాయిల్ తోటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కోసం రైతులకు ఉపయోగకరంగా ఉండే ముందస్తు వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ సూచించారు. గురువారం తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించ గలరన్నారు. రసాయనాలతో ఒకవైపు ఆరో గ్యం, మరోవైపు భూమికి నష్టం కలుగుతుం దన్నారు. రుతు పవనాలకు ముందుగానే 30 రకాల పంటలకు సంబంధించి విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు అవసర మైన నవధాన్యాల కిట్లను రైతుసేవా కేంద్రాల పరిధిలో సిద్ధం చేయాలని తెలిపారు. నవధాన్యాలు సాగు చేసే రైతులు వివరాలను నమోదుతో పాటు విస్తీర్ణంపై ఈక్రాప్ చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ సంస్థలతో సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడు తూ.. రైతులు విధిగా మట్టి నమూనా పరీక్షలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేయని గ్రామాల్లో నవధాన్యాల కిట్లను సిద్ధం చేయాలన్నారు. 365 రోజులు భూమిపై పంటలు పండించడంతో బహుళ ప్రయోజనా లు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయ భారతి, సంస్థ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, రైతు సాధికార సంస్థ ప్రతినిధి బి.భాను, రాజారావు, ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతంపేటలో కురుస్తున్న వర్షం



సాలూరు డబ్బివీధిలో రోడ్డుపై మురుగునీరు

జిల్లాలో భారీ వర్షం

- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

పార్వతీపురం/పాలకొండ/సాలూరురూరల్/వీరఘట్టం, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. పార్వతీపురం, కురుపాం, సీతంపేట, గుమలక్ష్మీపురం, పాలకొండ, సాలూరు, వీరఘట్టం, భామిని, జియ్యమ్మవలస, తదితర మండలాల్లో రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు వాన పడింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరా కాసేపు నిలిచిపోయింది. పాలకొండ పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ వరద నీటితో నిండిపోయాయి. పాలకొండ, వీరఘట్టం ప్రధాన రహదారుల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. సాలూరు పట్టణంలోని డబ్బివీధి, నాయుడువీధి తదితర వీధుల్లో మురుగు నీరు రోడ్డుపై ప్రవహించింది. బాటసారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

ఘనంగా మేడే వేడుకలు

వాడవాడలా రెపరెపలాడిన ఎర్ర జెండా

6లో

నులకజోడులో మళ్లీ జ్వరాలు

● నలుగురిలో లక్షణాల గుర్తింపు ● వైద్య శిబిరం ఏర్పాటు


నులకజోడులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భామిని, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నులకజోడులో మళ్లీ జ్వరాలు ప్రబలాయి. గురువారం నలుగురిలో జ్వరాల లక్షణాలు బయటపడ్డాయి. 20 రోజుల కిందట గ్రామానికి చెందిన 17 మంది జ్వరాలు, కాళ్లు, చేతుల నొప్పులతో బాధపడుతూ సీతంపేట, ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్సపొంది కోలుకున్నారు. మళ్లీ గ్రామంలో జ్వరాలు వ్యాపించడంతో ఆందోళన మొదలైంది. దీంతో మండల ప్రత్యేకాధికారి డి.సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి గురువారం గ్రామాన్ని సందరించారు. వైద్య శిబిరం నిర్వహించారు. బత్తిలి వైద్యాధికారి దామోదర్ 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కనీసం మూడు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇంటింటా జ్వరాల సర్వే చేశారు. మురుగు కాలువల్లో దోమల మందును పిచికారీ చేయించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి విజయకు ఎంపీడీవో సత్యం సూచించారు.

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురంటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన నిషేధమా.. అదెక్కడ అన్న కథనానికి ఆయన స్పందించారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే 120 మైక్రాన్ల మందం కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను ఒక్కసారి వినియోగించిన తర్వాత రెండో సారి వినియోగించడం పట్టణంలో నిషేధించామని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్నామన్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రల ఆదేశాల మేరకు వరహాలగెడ్డలో వ్యర్థాలను తొలగించామని చెప్పారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రతిఒక్క విభాగం అధికారి భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రణాళిక విభాగం అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రణాళికలను రూపొందించడంతో పాటు పట్టణంలోని అనుమతులు లేని కట్టడాలపై నిఘా ఉంచాలన్నారు. అయితే ఈ సమావేశానికి ప్రజారోగ్య శాఖ విభాగానికి చెందిన అధికారులు హాజరుకాకపోవడం విశేషం.

అక్రమ కట్టడాలు నిలిపివేయాలి

● మహిళల నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

పాచిపెంట, మే 1 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట గ్రామ కంఠం స్థలంలో చేపట్టిన అక్రమ కట్టడాలను నిలిపివేయాలంటూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దన్నానవీధికి చెందిన మహిళలు నిరసన తెలిపారు. పాచిపెంటలోని గ్రామ కంఠంలో ముగ్గురు స్థానికులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీనిపై ఈ ఏడాది మార్చి 10న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేశారని చెప్పారు. అయితే మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలోని దేవుబుచ్చింపేట వద్ద ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 2న సాలూరు పట్టణం, రూరల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎస్ ఏఈ భాస్కరరావు చెప్పారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల వల్ల సాలూరు పట్టణం, నెలిపర్తి, కూర్మరాజుపేట, శివరాంపురం, పారన్నవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

● మక్కువ, మే 1 (ఆంధ్రజ్యోతి): మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ వెంకట భైరిపురం, మావుడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న తుండ, ఎర్రసామంతవలస సబ్‌స్టేషన్ల పరిధిలోని పిచ్చిమొక్కలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలరావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

శిక్షణ తరగతుల పరిశీలన


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఈవో రవి ప్రసన్నకుమార్

సీతంపేట రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా తరగతులను డిప్యూటీ డీఈవో రవి ప్రసన్నకుమార్ గురువారం పరిశీలించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఏవిధంగా బోధించాలో ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు హెచ్.వసంతకుమారి, ఉపాధ్యాయులు ధర్మారావు ఉన్నారు.

ఘనంగా మేడే వేడుకలు

● వాడవాడలా ఎగిరిన అరుణ పతాకం

● ర్యాలీలు నిర్వహించిన కార్మిక సంఘ నాయకులు

కార్మిక దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎర్ర జెండాలను ఎగురవేశారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కార్మిక నాయకులను.. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం దాసన్నపేట: పీడబ్ల్యూ మార్కెట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గజపతినగరం: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


పార్వతీపురం టౌన్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో..


బొబ్బిలి రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి



బొబ్బిలిలో ఏపీటీఎఫ్ నాయకుడు జేసీ రాజు ఆధ్వర్యంలో..


పాలకొండ: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు ఆధ్వర్యంలో..


రాజాం రూరల్: మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో..

ప్రతిభతోనే ఉన్నత అవకాశాలు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం/ బెలగాం, మే 1 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక ఆర్‌సీఎం కార్యాలయ సముదాయం ఆవరణలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయి వేసవి శిక్షణా తరగతులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో మొదటిస్థానం నిలిచిన విధంగానే క్రీడల్లో కూడా జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడలను తిలకించారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరానికి సంబంధించి శిక్షకులకు క్రీడా సామగ్రిని అందించారు.

50 కేంద్రాల్లో 18 క్రీడాంశాలపై శిక్షణ

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు కలిగిన 50 కేంద్రాల వద్ద 18 క్రీడా అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. అథ్లెటిక్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, చెస్, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, కిక్‌బాక్సింగ్, కరాటే, టైక్వాండో, సాఫ్ట్‌బాల్, వాలీబాల్ , యోగాపై నైపుణ్యం కలిగిన శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమాదేవి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.మురళీకృష్ణ, అంతర్జాతీయ బాక్సర్, అర్జున అవార్డు గ్రహీత సీరా జయరాం, ఆర్చరీ ఇల్లా కార్యదర్శి డీటీ గాంధీ, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు, టీడీపీ నాయకులు జీవీ నాయుడు, బెలగాం జయప్రకాష్‌నారాయణ, డాక్టర్ భానుప్రసాద్, సింహాలు, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, టీవీ రమణ పాల్గొన్నారు.

డోలీ మోతలు లేని గ్రామాలే లక్ష్యం

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

● రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


సందిగూడలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు చూడడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని మారుమూల గిరిశిఖర గ్రామాలైన తుంబకొండ-సంధిగూడ, ద్వారబందం- మూలగూడ గ్రామాల్లో రహదారి పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. పీఎం జన్‌మన్ పథకం కింద తుంబకొండ నుంచి సంధిగూడ గ్రామానికి రూ.1.44కోట్లు, ద్వారబందం గ్రామం నుంచి మూలగూడ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.85లక్షల నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. సందిగూడ గ్రామంలో ఓ వృద్ధురాలిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ రాధారాణి, ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ, సర్పంచ్ నీలయ్య, కూటమి నాయకులు ఎస్.మొఖలింగం, పవన్, ప్రసాద్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోండి

సాలూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉరిటి మహేంద్రకుమార్ అన్నారు. అన్నంరాజువలస, తాడంగివలస తదితర గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. తాడంగివలసలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, సకాలంలో పూర్తయ్యేలా శ్రద్ధ చూపాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు ఆదేశించారు. అన్నం రాజువలసలో మామిడిపల్లి వైద్యాధికారి డి.శివకుమార్ నిర్వహిస్తున్న వైద్యశిబిరం పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయిలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో రక్తహీనతతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కొందరు ఉన్నట్టు తెలిసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం వారికి సక్రమంగా అందేటట్టు చూడాలని ఎంపీడీవో పార్వతిని ఆదేశించారు. పౌష్టికాహారం పంపిణీలో సీడీపీవో, సూపర్‌వైజర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

అమరావతి బయలుదేరిన ఎమ్మెల్యేలు

పార్వతీపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి పనుల శంకుస్థాపన శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎమ్మెల్యేలు బయలుదేరి వెళ్లారు. మంత్రి సంధ్యారాణి ఇప్పటికే అమరావతిలో ఉన్నారు. పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ గురువారం అమరావతి బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి బుధవారం వెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సుల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు అమరావతి బయలుదేరి వెళ్లారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మక్కువ: గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి బి.శ్యామల అన్నారు. స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఆమె గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తి ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. మార్కొండపుట్టి గ్రామంలో పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. మండలంలో శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి జరిగేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులను పరిశీలించి ఫాంపాండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సింహాచలం, ఉపాధి ఏపీవో ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోటాను పెంచడం అభినందనీయం

పార్వతీపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ఉద్యోగాల్లో క్రీడా కోటాను రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచడం.. పెంచిన కోటాను డీఎస్సీలో అమలు చేయడం ఆనందంగా ఉందని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మంతిన వాసుదేవరావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతోమంది క్రీడాకారులకు ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్, క్రీడామంత్రి రాంప్రసాద్‌రెడ్డికి తమ సంఘం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

● 10వేల లీటర్ల బెల్లంఊట ధ్వంసం

పార్వతీపురంటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): సారా తయారీని నివారించేందుకు ఒడిశా, ఆంధ్రా రాష్ట్ర సరిహద్దుల్లో దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సురేష్ తెలిపారు. గురువారం నిర్వహించిన దాడుల్లో 10వేల 800 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశామని చెప్పారు. ఈ దాడుల్లో పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, సాలూరుతో పాటు విజయనగరం జిల్లాల నుంచి 27 మంది అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సాలూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కందులపథం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. మరో నలుగురు పరారయ్యారు. పరారైన వారి కోసం గాలిస్తున్నారు. జూదరులను అరెస్ట్ చేయడంతో పాటు రూ.26,190, మూడు బైక్‌లను సీజ్ చేశారు.

ఏజెన్సీలో దోమల నివారణ మందు పిచికారీ

గుమ్మలక్ష్మీపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్ఎస్ (ఏసీఎం) కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యుడు బుద్దేశ్వరరావు కోరారు. కేడీకాలనీ, జాబుగూడ, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పిచికారీ పూర్తి అయిన ఇళ్లకు మార్కింగ్ వేయాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, ఎంటీఎస్ అప్పలనాయుడు, హెల్త్ అసిస్టెంట్స్ రాధాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

పార్వతీపురంటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాచిపెంట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటికపెంట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 7వ తరగతి ఒక సీటు, 8వ తరగతికి రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు మే 11న ఆఫ్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ దేవేందర్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 10వ తేదీలోపు కోటికపెంట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు.

బొబ్బిలి ఐటీఐలో..

బొబ్బిలి రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గిరిజనులకు అందిన బియ్యం

సాలూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): దళాయివలస జీసీసీ డీఆర్ డిపో పరిధిలో ఉన్న రేషన్‌కార్డుదారులకు గత నెల రేషన్ బియ్యం గురువారం పంపిణీ చేశారు. రేషన్ బియ్యం ఇవ్వలేదని బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా చేసిన విషయం విధితమే. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో ఈ విషయమై జీసీసీ డీఎం ఉరిటి మహేంద్రకుమార్ ఆరా తీశారు. దీంతో సాలూరు జీసీసీ బ్రాంచి మేనేజర్ జె.రామారావు యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకున్నారు. ఈ డిపో పరిధిలో ఉన్న 250 మంది గిరిజన కార్డుదారులకు 60 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఈ విషయమై జీసీసీ సాలూరు బ్రాంచి మేనేజర్ రామారావు మాట్లాడుతూ దళాయివలసలో ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ గ్రూప్ తరఫున బియ్యం పంపిణీ చేసే వ్యక్తి బియ్యం విడిపించిన అనంతరం అనారోగ్యంతో అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. గత నెల బియ్యం పంపిణీ చేశామన్నారు. ఈ నెల బియ్యం రెండు రోజుల్లో అందిస్తామని తెలిపారు.

సాలూరులో పారిశుధ్య పనుల పరిశీలన

సాలూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు శ్యామలాంబ పండగ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ బీటీవీ కృష్ణారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణలు గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. పదో వార్డులో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై టీడీపీ నాయకుడు చంద్ర, సామాజిక కార్యకర్త కృష్ణ వారికి వివరించారు. దండిగాం రోడ్డులో మురుగు ప్రవాహానికి వీలుగా ఎక్స్‌కవేటర్‌తో పొదలను తొలగింపజేశారు.

ఆర్డరు 21 రూలు 64 CPC నోటీసు

మ॥రా॥శ్రీ॥ సాలూరు జూ॥సి॥జడ్జి కోర్టు వారి సముఖమునకు

EP No.44/24 in O.S.13/23

Between:-
శ్రీ కర్రి వెంకటరెడ్డి ....DHR
And:
శ్రీమతి మూకల కుమారి ....JDR
To

శ్రీమతి మూకల కుమారి వ॥48 సం॥ W/o గౌరి, హిందూ గృహ కులవృత్తిలు సా॥ శివాలయం రోడ్డు, దాసరి వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా

పై నెంబరు అమలును మీపై షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం కోరి పై కోర్టులో దాఖలు చేయడమైనది. సదరు అమలులో కోర్టు వారు CPC తాలూక R64 ప్రకారం నోటీసు జారీచేసిరి. సదరు అమలులో ఎన్ని పర్యాయములంలు నోటీసులు జారీ చేసినప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనందున పై నెంబరు అమలులో పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు సర్వీసు అయ్యేలాగా అర్డరు జారీ చేసిరి. కోర్టువారి అర్డరు ప్రకారం సదరు అమలులో మీ యొక్క హాజరు నిమిత్తం తేది 18.7.2025 నాటికీ వాయిదా అయియున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30ని॥ లకు స్వయంగాని, వకీలు ద్వారా గాని, హాజరు అయి మీ యొక్క అక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియపర్చవలెను. లేని నాడు మీ పరోక్షమందు తీర్పు వెలువరించ గలరని యిందుమూలంగా మీకు తెలియచేయడమైనది.

సాలూరు
తేది.01.05.2025

శ్రీ రేగు సూర్యనారాయణ,
పిటిషనరు తరుఫున న్యాయవాది
సెల్: 7382071863

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

● నెల రోజుల పాటు నిర్వహణ

సీతంపేట రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు నెల రోజులపాటు ఉంటాయని స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. బాస్కెట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ క్రీడల్లో విద్యార్థులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణా శిబిరాలు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పాలకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, భామిని మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు శిక్షకులు ఎస్.ఈశ్వరరావు, ఎం దిలీప్, రాజేష్, రమేష్‌లు ఉన్నారు.

కుల గణనపై హర్షం

బొబ్బిలి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణన చేసేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయించడం పట్ల రాష్ట్ర రెల్లి గ్రూపు కులాల ఉద్యోగస్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండి విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేవుదళ కేజీబీవీకి మహర్దశ

●రూ.1.60 కోట్లతో కళాశాల భవనం ● రూ.41 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ నిర్మాణాలు

రేగిడి, మే1 (ఆంధ్రజ్యోతి): దేవుదళ కస్తూర్బా బాలికల విద్యాలయానికి మహర్దశ పట్టింది. గత ప్రభుత్వం ఈ విద్యాలయాన్ని కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే అందుకు తగట్టు రూ.1.60 కోట్లతో భవనం పైఅంతస్తు, కింద 8 గదులతో భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అప్పట్లో బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఎక్కడి పనులు అక్కడే నిలిపేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో పనులు ఊపందుకున్నాయి. కళాశాల భవనం పూర్తిచేయడంతో పాటు రూ.18 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.23 లక్షలతో లైబ్రరీ ఏర్పాటుకు నిధులు మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేశారు. దాంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయి.

నెలరోజుల్లో పనులు పూర్తిచేస్తాం..

దేవుదళ కేజీబీవీలో భవన నిర్మాణాలు మరో నెలరోజుల్లో పూర్తి చేస్తాం. రూ. 41 లక్షలతో నిర్మాణం చేపడుతున్న కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ నిర్మాణాలు 70 శాతం పూర్తయ్యాయి. ద్వారాలు, కిటికీలు మాత్రం ఏర్పాటు చేయాల్సి ఉంది.

-దాలయ్య, సమగ్రశిక్ష, ఏఈ


చురుగ్గా సాగుతున్న భవన నిర్మాణం

నేటినుంచి కిశోర వికాసంపై శిక్షణ

విజయనగరం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి గ్రామాల్లో కిశోర వికాసంపై వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్టు సీడీపీవో ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2న మహిళ పోలీసుల ఆధ్వర్యంలో బాలికలు ఒకరికొకరు పరిచయం, లక్ష్యాలు నిర్దేశించుకోవడం, 6న రుతుక్రమం పరిశుభ్రత, లైంగిక విద్య, 9న ఏఎన్ఎంల ఆధ్వర్యంలో పునరుత్పత్తి, ఆరోగ్యం-బాల్య వివాహాలు కలిగే నష్టాలు, 13న బాలల హక్కులు-రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తారన్నారు. 16న ఆశా వర్కర్లు ఆధ్వర్యంలో కౌమారదశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, 20న లింగ వివక్ష, అసమానతలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. 23న ఉన్నత విద్య-నైపుణ్యాలు, కెరీర్ మార్గ దర్శకత్వం, 27వ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, 30న ఆర్థిక అంశాలు నిర్వహణ, జూన్ 3న కౌమర బాలికల నాయకత్వం, సాధికారితపై అవగాహన, 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటలు ప్రాముఖ్యత, 10న బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, నివారణపై అవగాహన, 4న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు సీడీపీవో ప్రసన్న తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

విజయనగరం రింగురోడ్డు, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉడా, ధర్మపురి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా కాలనీ ఫేజ్-2, 3, 4, బొబ్బాదిపేట, మహాలక్ష్మీ నగర్, గోకపేట, సూర్యానగర్, సాలిపేట జంక్షన్, ఆదిత్యనగర్, వివేకానంద కాలనీ, ఫిష్ మార్కెట్ ఏరియా, ధర్మపురి, బియ్యాలపేట, వసంతవిహార్, పద్మావతీఅనగర్, గాయత్రీ నగర్, టౌన్ సెంటర్ లేఅవుట్, వెంకటేశ్వర టెంపుల్ ఏరియా, నేబుల్ నగర్, శివాలయం వీధి, మూడు లాంతర్లు జంక్షన్, వెంకటపద్మా ఆసుపత్రి, రిలయన్స్ డిజిటల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

●రాజాం: రాజాంలో రోడ్ల విస్తరణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ డిప్యూటీ డీఈఈ ఫణికుమార్. ఏఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీ కాలనీ, మెంటిపేట కాలనీ, లచ్చయ్యపేట, పోలీస్ స్టేషన్ రోడు, బొబ్బిలి రోడ్డులోని అమ్మవారి కాలనీ, మెంటిపేట ఎస్సీ కాలనీ, తిమ్మయ్యపేట, ఆదర్శనగర్ కాలనీ, కొండంపేట, మాదిగ వీధి, గొల్లవీధి, చాలకవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

శిక్షణ శిబిరం ప్రారంభం

శృంగవరపుకోట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు గురువారం ఏటీఎల్ సమ్మర్‌బూట్ క్యాంప్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి లెండి ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. తొలిరోజు వర్క్‌షాప్‌లో పేపర్ ట్రోనిక్స్ పేపర్‌పై ఎలక్ట్రికల్ సర్క్యూట్ డిజైనింగ్ చేయడం నేర్పించారు. కార్యక్రమంలో టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి వి.రమేశ్, హెచ్ఎం ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

నెల్లిమర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గంటా సతీష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్‌లో సవిధాన్ బచావో అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగ ఆవశ్యకతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ తారకేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, మే1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరులో ముగ్గురు వితంతువులకు ప్రభుత్వ మంజూరు చేసిన స్పౌజ్ పింఛన్లను ఆమె పంపిణీ చేశారు.

కులగణనపై కేంద్ర నిర్ణయం హర్షణీయం

విజయనగరం బాబామెట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణనపై నిర్ణయించడం హర్షణీయమని బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు చోడి ఆదినారాయణ అన్నారు. గురువారం నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల ప్రయోజనం కోసం బీసీ కులగణన బిల్లుకు క్యాబినెట్ ఆమోదించడం అభినందనీయమన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

విజయనగరం క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలు, వేతన సవరణ చట్టాలపై కార్మికులకు అవగాహన అవసరమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు పనిచేస్తున్న చోట ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన పరిసరాలు ఉండేలా చూడాలన్నారు. కనీస సౌకర్యాలు, యాజమాన్యం కల్పించాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100 ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ సూర్యప్రకాశ్, డిపో మేనేజరు జె.శ్రీనివాస్, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు జి.లలిత, జి.తిరుపతి తదితరులున్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి

పథకాలను సద్వినియోగం చేసుకోండి

గజపతినగరం, మే1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్ రాజ్ కుమార్ సూచించారు. గురువారం మే డే సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో శ్రామికుల హక్కులు వాటి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రమణాజీ, రెడ్డి శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందుగుండును తనిఖీ చేయండి: ఎస్పీ

విజయనగరం క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనధికారికంగా మందుగుండు సామాగ్రి తయారీ, నిల్వలు, విక్రయాలు జరిపే వారిపై దాడులు విస్తృతం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లైసెన్సులు కలిగి, మందుగుండు సామగ్రి నిల్వలు, విక్రయాలు చేపట్టే గొడౌన్లు, షాపుల్లో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించి నివేదికలు అందజేయాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న వస్తువులను గొడౌన్లు, షాపులలలోకి అనుమతించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫైర్ ఫైటింగ్ పరికరాలు అందుబాటులో వుండే విధంగా షాపు యాజమానులు చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.


ఎస్పీ వకుల్ జిందాల్

బొత్స వ్యాఖ్యలు బాధాకరం

చీపురుపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో బుధవారం జరిగిన దుర్ఘటనపై వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమైనవని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ నాగార్జున అన్నారు. గురువారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ జరిగిన ఘటనను రాజకీయం చేయడం తగదన్నారు. భక్తులు, ప్రజల రక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఘటన జరిగిన తక్షణమే ముఖ్యమంత్రి దర్యాప్తునకు ఆదేశించారని గుర్తుచేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో కూడా ప్రకటించిన విషయాన్ని గుర్తించాలని నాగార్జున కోరారు.

సమస్యలను పరిష్కరిస్తాం..

డెంకాడ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని చింతవలసలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రతీ అధికారి తీసుకోవాలన్నారు. ప్రతీ సమస్యను కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీవో భవాని, ఏపీఎం శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, జనసేన పార్టీ మండల కో-ఆర్డినేటర్ పైలశంకర్ తదితరులున్నారు.

●భోగాపురం: సామాజిక పింఛన్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపిస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని ముంజేరులో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిశోర్‌కుమార్, ఈవోపీఆర్‌డీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో వారాల పండుగకు శ్రీకారం

నెల్లిమర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటలో వారాల పండుగకు అమ్మవార్ల కుటుంబాలు, గ్రామ పెద్దలు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 1న దుర్గాలమ్మ, 8న రాజబంగారమ్మ, 13న ముత్యాలమ్మతల్లికి మొక్కులు చెల్లించేందుకు నిర్ణయించారు. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం గ్రామంలోని ఆరిపాక, పారాది ఇంటిపేర్లతో ఉన్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలు చెక్కతో తయారు చేసిన దుర్గాలమ్మ తల్లి ప్రతిమలను అమ్మవార్ల కుటుంబీకులు, గ్రామ పెద్దలు, పండుగ నిర్వహణ కమిటి ప్రతినిధులు, గ్రామస్థులు ఊరేగింపుగా వచ్చి దుర్గాలమ్మ ప్రతిమలను తీసుకువెళ్లారు కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు.


ప్రతిమను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించండి

గజపతినగరం, మే1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపల్లిలో గల జంగాల కులస్థుల శ్మశానవాటిక ఆక్రమణలకు గురవుతుందని మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జంగాలు పెద్దలలు గురువారం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఆనుకుని సర్వే నెంబర్ 275లో గతంలో జంగాల శ్మశాన వాటికకు స్థలం కేటాయింపులు జరిగిందని వివరించారు.

నైతిక విలువలతో సమాజాభివృద్ధి

●మాన్సాస్ చైర్మన్ అశోక్ గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు, మే 1 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు, సద్గుణంతో కూడిన విద్య సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. బుధవారం రాజా సాహెబ్ పీవీజీ రాజు శతజయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలను కోటలోని మాన్సాస్ మహారాజా కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ అప్పట్లో అక్షరాస్యత కేవలం ఏడు శాతం మాత్రమే ఉండేదన్నారు.సామాన్య ప్రజలకు ఉచిత విద్యను అందించాలన్న లక్ష్యంతో డాక్టరు పీవీజీ రాజు ఎంతగానో కృషి చేశారన్నారు. గుణాత్మక విద్యను అందించడానికి ఆయన బీఈడీ కళాశాలను కూడా స్థాపించారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద ప్రతిభ గల విద్యార్థులకు రూ.5 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. కార్యక్రమంలో మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్, డాక్టరు టీవీఎల్ఎన్ రాజు, ఆర్‌వీ సునీతాప్రసాద్, చంద్రమౌళి, ఊర్మిళ, ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టరు పీఎస్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు అందజేస్తున్న అశోక్ గజపతిరాజు

బలహీన వర్గాల ఆశాజ్యోతి పీవీజీ రాజు

విజయనగరం దాసన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించిన ఆశాజ్యోతి డాక్టరు పీవీజీ రాజు అని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. పీవీజీ రాజు 101వ జయంతి వేడుకలను పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో గురజాడ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. దేశ రాజకీయాల్లో పీవీజీకి గుర్తింపు ఉందని, పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందించడంలో ప్రత్యేక శైలి ఉండేదన్నారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ మాన్సాస్ విద్యా సంస్థల్లో చదువుకోవడం గొప్ప అదృష్టంగా భావించేవారన్నారు. అలా చదువుకునే దేశవ్యాప్తంగా పెద్ద స్థాయిలో ఉన్నవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ద్వారం దుర్గాప్రసాదరావు, నారాయణం శ్రీనివాస్, డాక్టరు జి.వెంకట్, గాడి ప్రసాద్, చంద్రిక, మలిచర్ల కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. అలాగే కోడి రామమూర్తి వ్యాయామ సంఘం ఆధ్వర్యంలో విద్యప్రదాత పీవీజీ రాజు జయంతి వేడుకలను సంఘం అభినవ భీమపెద్ది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీవీజీ రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ప్రతిభావంతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి

చంద్రబాబు నమ్మకాన్ని ఒమ్ముచేయను

● డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

చీపురుపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఒమ్ము చేయనని డీసీసీబీ చైర్మెన్‌గా నియమితులైన కిమిడి నాగార్జున అన్నారు. ఆయన నియామకాన్ని పురస్కరించుకుని గురువారం చీపురుపల్లిలోని నివాసంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కూటమి నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, డీసీసీబీ అధికారులు, ఉద్యోగులు నాగార్జునను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. ఆయనను కలిసిన వారిలో డీసీసీబీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి అచ్యుతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, ఏపీఎస్ రాజు, రవి, ఎం.రాజ్‌కుమార్, రమణ, నాయకులు బూర్లె శ్రీధర్, కంది చంద్రశేఖర్, రౌతు కామునాయుడు, కె.రవికుమార్, కిమిడి అశోక్‌బాబు, పల్లేడ భాస్కరరావు, పాణిరాజు, రాజశేఖర్, మనోహర్, తూర్పు కాపు ఉద్యోగుల సంఘం జి.సత్యనారాయణ, మీసాల అప్పలనాయుడు, శ్రీను, రాము తదితరులున్నారు.


నాగార్జునను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

ప్రధాని సభను జయప్రదం చేయండి

రాజాం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభను శుక్రవారం అందరూ జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ముందుగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమలను నెలకొల్పి లక్షలాది మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో చంద్రబాబు, లోకేశ్ కృషి చేస్తున్నారని కోండ్రు అన్నారు.

●చీపురుపల్లి: అమరావతిలో శుక్రవారం ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అందరూ విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కోరారు. గురువారం ఆయన చీపురుపల్లిలో పార్టీ నాయకులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు గర్వించేలా అమరావతి పనులు ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమానికి ప్రధాని మంత్రి మోదీ రావడం శుభపరిణామన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం

శృంగవరపుకోట/ లక్కవరపుకోట, మే 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎమ్మెల్యే లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.బి.ఎ.రామప్రసాద్‌తో కలిసి కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు గురువారం విశాఖలో ఎంపీని కలిశారు. మార్కెట్ కమిటీ పదవి అప్పగించినందుకు చొక్కాకుల కృతజ్ఞతలు తెలిపారు.

●శృంగవరపుకోట/రూరల్: విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను విశాఖలో గురువారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు కేటాయించిన డీసీఎంస్ చైర్మన్ పదవికి న్యాయం చేస్తానన్నారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జామి మండల అధ్యక్షుడు లగుడు రవి, జుత్తాడ రామసత్యం, గొంప వెంకటరావు తదితరులున్నారు.


ఎంపీ శ్రీభరత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చొక్కాకుల


ఎంపీతో డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

ఆటో బోల్తా: బాలుడి మృతి

గజపతినగరం, మే1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ జంక్షన్ వద్ద ఆటో బోల్తాపడి బాలుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. మరుపల్లి గ్రామానికి చెందిన బండి కార్తీక్ (14) అదే గ్రామంలో ఆటో ఎక్కి దత్తిరాజేరు మండలం పెదమానాపురం వెళ్తున్నాడు. గుడివాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆటోకు ఎదురుగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి విశాఖలో ప్లంబర్‌గా పని చేస్తుంటారు. తల్లి సంతోషి పిల్లలతో పాటు మరుపల్లిలో నివాసం ఉంటున్నారు. మృతుడికి తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పొలం గట్టుపై నుంచి జారిపడి ఒకరు..

కొత్తవలస, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పొలం గట్టుపై నుంచి జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తవలసలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి కొత్తవలస సీఐ షణ్ముఖరావు అందించిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం పెదనందిపల్లి గ్రామానికి పల్లా గంగునాయుడు (48) ఇంటి వద్ద ఒక్కడే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. గతనెల 27న మండలంలోని సంతపాలెంలో నివాసం ఉంటున్న తన తమ్ముడు ఇంటికి వచ్చాడు. రెండురోజుల పాటు ఉన్న గంగునాయుడు మేకల మందను కాసే పని వెతుక్కుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మేకల మంద కాసే పనికోసం వెళ్లిన గంగునాయుడు పూటుగా మద్యం సేవించి మండలంలోని గనిశెట్టి పాలెం గ్రామానికి చెందిన పొలం గట్టుపై నుంచి జారి పడ్డాడు. ఎవరూ గుర్తించకపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గురువారం పొలం గట్ల కింద పడి ఉండటాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సిబ్బందితో వెళ్లి చూసినప్పటికే మృతి చెంది ఉండడంతో కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు.

చెట్టుపై నుంచి పడి యువకుడు..

దత్తిరాజేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడసాం గ్రామానికి చెందిన మజ్జి రామునాయుడు (35) గురువారం చింతచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తన కల్లంలో ఉన్న చింతచెట్టు ఎక్కి చింత కాయలు దులుపుతున్న సమయంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. దాంతో తీవ్ర గాయాలయ్యారు. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. అకంకడ నుంచి వైద్యులు విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ రామునాయుడు మృతి చెందారు. మృతుడికి భార్య గంగమ్మ, కుమార్తె హారిక ఉన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్: వ్యక్తికి గాయాలు

కొత్తవలస, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బైక్‌తో ఆటోను ఓ వ్యక్తి ఢీకొన్న ఘటన మండలంలోని దేవరాపల్లి రోడ్డులో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కొత్తవలస నుంచి ముసిరాం వైపు మద్యం మత్తులో బైక్‌ను నడుపుతున్న యువకుడు ముసిరాం నుంచి కొత్తవలస ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీకొన్నాడు. దాంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి రెండు చేతులు విరిగాయి. ఆటో డ్రైవర్‌కు కూడా చెయ్యి విరిగింది.

అత్యాచారం కేసులో వ్యక్తికి జైలు

విజయనగరం క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదైన అత్యాచారం, నమ్మించి మోసగించిన కేసులో రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన టంకాల శంకరరావుకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు న్యాయాధికారి ఎస్.పద్మావతి గురువారం తీర్పు వెల్లడించినట్టు మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ నర్సింగరావు ప్రకటనలో తెలిపారు. శంకరరావు ఓ మహిళను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. పెళ్లికి నిరాకరించడంలో మహిళా పోలీసు స్టేషన్‌లో 2022లో ఫిర్యాదు నమోదైందన్నారు. అప్పటి ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేయగా, సీఐ ఎం.శేషు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. శంకరరావు నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్ఐ నర్సింగరావు తెలిపారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని దేవుని కణపాకలో ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు గురువారం నిర్వహించిన దాడుల్లో 5 లీటర్ల సారాతో అరసవిల్లి నరసయ్య పట్టుపడ్డారు. సారాను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు, హెచ్‌సీలు ఎం.అప్పారావు, వి.కృష్ణ, కానిస్టేబుల్ సంతోషికుమారి పాల్గొన్నారన్నారు.

రోవర్ భద్రం

● నెల్లిమర్ల నగర పంచాయతీలో గుర్తింపు ● 16 నెలల నిర్లక్ష్యం

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో మేల్కొన్నవైనం

రాజాం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ యంత్రాంగం నిర్లక్ష్యం మరోసారి స్పష్టమైంది. మున్సిపాలిటీకి చెందిన సుమారు రూ.10 లక్షల విలువ చేసే రోవర్ మిషన్‌ను సరిగ్గా 16 నెలల క్రితం నెల్లిమర్ల నగర పంచాయతీ అధికారులకు ఇచ్చిన ఆధికారులు తరువాత ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోయారు. 2023 డిసెంబరులో నెల్లిమర్ల నగర పంచాయతీలో సర్వే జరిగిన సమయంలో రాజాం మున్సిపాలిటీ నుంచి రోవర్‌ను అక్కడి అధికారులు తీసుకెళ్లారు. సర్వే పూర్తయ్యాక తిరిగి రాజాం మున్సిపాలిటీకి అప్పగించే ప్రయత్నాలు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రోవర్ బాధ్యతల నిర్వహణను ప్రత్యేకంగా ఎవరికీ అప్పగించకపోవడంతో అధికారులు దీనిపై దృష్టి సారించలేని పరిస్థితి. ఇదిలా ఉంటే రాజాం మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల సర్వే సమయంలో రోవర్ లేదని గుర్తించిన యంత్రాంగం కనీసం పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. మున్సిపల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చానని స్పష్టం చేసిన రాజాం మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తదుపరి చర్యలపై దృష్టి సారించలేదు. మెంటిపేట, వాసవీనగర్, కొండంపేట, రంగప్పచెరువు సర్వే సమయంలో రాజాం తహశీల్దార్ కార్యాలయం నుంచి రోవర్‌ను తీసుకువచ్చారు. రాజాం మున్సిపాలిటీలో రోవర్ కనిపించని విషయాన్ని గత నెల 26న 'రాజాం మున్సిపాలిటీలో రోవర్ మిస్సింగ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. మున్సిపాలిటీలకు ప్రభుత్వం రోవర్లు సరఫరా చేసిన సమయంలో కేటాయించిన నెంబర్ ఆధారంగా ప్రయత్నించారు. రాజాంకు చెందిన రోవర్ నెల్లిమర్లలో ఉందని గుర్తించారు. దీంతో రోవర్‌ను రాజాం మున్సిపాలిటీకి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించారు.

కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లకు దరఖాస్తులు

● నేటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం

విజయనగరం కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం పేద పిల్లలు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్యనభ్యసిం డానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించారు. లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఐదు నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కేటాయించిన 25 శాతం సీట్లలో అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు చెందిన పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు చెందిన బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించారు. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ఈ నెల 2వ తేదీ నుంచి 19 వరకూ చేసుకోవచ్చు. అర్హులైన వారికి ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు, తెల్లరేషన్ కార్డు, పోస్ పోర్టు, భూమి హక్కు పత్రం, ఉపాధి హామీ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇంటి అద్దె ఒప్పందం కాపీ, విద్యుత్ బిల్లు ఉండాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 29న మొదటి లాటరీ తీస్తారు. ఎంపికైన వారు జూన్ 8లోగా పాఠశాలల్లో చేరాలి. ఎవరికైనా పాఠశాలల్లో చేరడానికి ఇష్టం లేకపోతే మిగిలిన సీట్లకు జూన్ 11న మరోసారి లాటరీ తీస్తారు. వీరు జూన్ 18లోగా పాఠశాలల్లో చేరాల్సి ఉంది.

●ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టరు రామారావు కోరారు. ఈనెల 19లోగా సీఎస్ఇ.ఏపీ.జీవో.ఇన్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.